# అకడమిక్ భవనం ప్రారంభం ఎప్పుడో?

- గత ప్రభుత్వంలో రూ.6 కోట్లతో భవన నిర్మాణం
- ఆరు నెలలుగా ప్రారంభోత్సవానికి ఎదురుచూపులు
- నూతన కోర్సులకు అవకాశం



నూజివీడు పీజీ కేంద్రం ఆవరణలో నిర్మాణం పూర్తయిన అకడమిక్ భవనం

నూజివీడు: కృష్ణా యూనివర్సిటీ పరిధిలోని పట్టణంలో ఉన్న ఎమ్మార్ అప్పారావు కాలేజీ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేషన్ స్టడీస్ (పీజీ కేంద్రం) ఆవరణలో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించిన అకడమిక్ భవనం ప్రారంభోత్సవానికి ఎదురుచూస్తోంది. పీజీ కేంద్రంలో చదువుతున్న 400 మంది విద్యార్థుల సౌకర్యార్థం నూతన కోర్సులను తీసుకుచ్చేందుకు అందుబాటులో తరగతి గదులు ఉండాలనే లక్ష్యంతో మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు కృషితో అకడమిక్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ 2021 ఆగస్టు 11న ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి జీ+3 భవన నిర్మాణ పనులు ప్రారంభమై ముమ్మరంగా కొనసాగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ కాలంలో 95 శాతం పనులు పూర్తయ్యాయి. ఆ తరువాత ఈ ఏడాది జనవరికి ఈ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అయితే అప్పటి నుంచి ఈ భవనాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారా అని విద్యార్థులు, అధ్యాపకులు ఎదురు చూస్తున్నారు.

### అందుబాటులోకి రానున్న 40 తరగతి గదులు

జీ+3 గా నిర్మించిన ఈ భవనంలో తరగతి గదులు, ల్యాబ్‌లకు కలిపి మొత్తం 40 గదుల వరకు ఉన్నాయి. దీనిని ప్రారంభిస్తే తరగతి గదులు, అన్ని వసతులతో కూడిన ల్యాబ్‌లు విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయి. కానీ కూటమి ప్రభుత్వంలోని పాలకులు మాత్రం భవనాన్ని ప్రారంభించకుండా వృథాగా ఉంచుతున్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన భవనం వృథాగా పడి ఉంటున్నా పాలకులకు కనీసం చీమ కుట్టినట్లుగా కూడా లేదని పీజీ విద్యార్థులు, పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పీజీ కేంద్రంలోని భవనాన్ని ప్రారంభించాలని విద్యార్థులు కోరుతున్నారు.

### నూతన కోర్సులు తెచ్చేందుకు వీలుగా..

తరగతి గదులు అందుబాటులో ఉంటే అవసరమైతే నూతన కోర్సులు తీసుకు రావచ్చనే సదాశయంతో అకడమిక్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఈ పీజీ కేంద్రంలో అప్లెడ్ మ్యాథ్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫిజిక్స్, అనలైటికల్ కెమిస్ట్రీ, స్టాటిస్టిక్స్, ఎంబీఏ, ఎంకామ్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటికి తోడు జనరల్ మ్యాథ్స్, ఎంఏ ఇంగ్లిష్, ఎంఏ జర్నలిజం తదితర మరిన్ని కోర్సులు తీసుకువచ్చేందుకు వీలుగా భవన నిర్మాణాన్ని చేపట్టారు. తరగతి గదులకు తోడు ల్యాబొరేటరీలకు గదులను అన్ని వసతులతో నిర్మించారు. నిర్మాణం పూర్తి చేసుకున్న అకడమిక్ భవనాన్ని ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### అకడమిక్ భవనాన్ని ప్రారంభించాలి



నిర్మాణం పూర్తి చేసుకున్న అకడమిక్ భవనాన్ని వెంటనే ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలి. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక ఇబ్బందులు పడుతున్నా నూతన భవనాన్ని ప్రారంభించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆరు నెలలుగా భవనాలు ప్రారంభోత్సవానికి ఎదురుచూస్తున్నా పట్టించుకోకపోవడం దారుణం.

–కొలికపూడి లెనిన్, ఎస్ఎఫ్ఐ ఏలూరు జిల్లా కార్యదర్శి, నూజివీడు

### నిర్లక్ష్యం సరికాదు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్యార్థుల సదుపాయం నిమిత్తం కోట్లాది రూపాయలతో నిర్మించిన అకడమిక్ భవనాన్ని నిర్మించినా ప్రారంభించకుండా ఉంచడం దారుణం. చదువుకునే విద్యార్థులకు వసతులు అందుబాటులో ఉన్నా పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతమాత్రం సరికాదు. భవనాన్ని వెంటనే ప్రారంభించాలి.

–కంచర్ల లవకుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, నూజివీడు

## క్లుప్తంగా

### మృతురాలి కుటుంబానికి మేకా ప్రతాప్ పరామర్శ



ముసునూరు: చెక్కపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత చిట్లూరి నాగేశ్వరరావు సతీమణి కనకమ్మ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు సందర్శించి నివాళులర్పించారు. జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజానాయన, నాయకులు కాటేపల్లి లింగారావు, రమేష్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

### చాట్రాయిలో స్వచ్ఛ భారత్



చాట్రాయి: చాట్రాయిలో శనివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గృహాల్లో చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని మండల ప్రత్యేకాధికారి వెంకటరత్నం పేర్కొన్నారు. అనంతరం సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల క్షేత్ర పర్యటన

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శనివారం విజయవాడలో క్షేత్ర పర్యటన చేశారు. మొగల్రాజపురంలోని అతి ప్రాచీన గుహల సముదాయాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు సందర్శించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవి మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదుల్లో పరోక్ష జ్ఞానాన్ని మాత్రమే పొందుతారని, ప్రత్యక్ష జ్ఞానాన్ని పొందేందుకు, సమాజంపై సరైన అవగాహన కలిగేందుకు క్షేత్ర పర్యటనలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. తెలుగు శాఖ అధ్యాపకులు మెండా దేవానంద కుమార్ మాట్లాడుతూ ఈ గుహల సముదాయాలను సందర్శించడం వలన 1500 సంవత్సరాల కిందటి మన సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులు సులభంగా తెలుసుకోగలిగారన్నారు. ఎన్నో దాడులు, ప్రకృతి విపత్తులను తట్టుకుని ఈ కట్టడాలు నేటికీ నిలిచి ఉన్నాయని వివరించారు.

### మహిళా కబడ్డీ చాంప్ మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు



మైలవరం: గత రెండు రోజులుగా విజయవాడ నలంద డిగ్రీ కళాశాలలో జరిగిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళా కబడ్డీ పోటీల్లో తమ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపి యూనివర్సిటీ మహిళా కబడ్డీ ట్రోఫీని సాధించారని ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నే స్వామి తెలిపారు. కళాశాల క్రీడాకారులు ఆడిన అన్ని మ్యాచుల్లోనూ విజయం సాధించారన్నారు. క్రీడాకారులను కళాశాల సీపీడీసీ సభ్యులు, ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

### జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థులు



మైలవరం: జి.కొండూరు మండలం కవులూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ శనివారం తెలిపారు. విజయవాడలో శుక్రవారం జరిగిన డివిజనల్ లెవెల్ సెలక్షన్స్‌లో తమ పాఠశాల విద్యార్థులు కె. కోమల్‌దీప్, వి. సిద్ధార్థ, డి. విక్రమ్, ఎం. మున్న ఎంపికయ్యారన్నారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, పీడీ పి. శ్రీలతలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు విద్యాసాగర్, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు అభినందించారు.

### వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



తిరువూరు: విస్సన్నపేటలో శుక్రవారం జరిగిన డివిజనల్ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ జూనియర్, సీనియర్ విభాగాల్లో స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీఎస్ఎన్ రాజు తెలిపారు. జూనియర్స్ అండర్ 14 బాలికల విభాగంలో కె. వర్షిత, జె. గౌతమి, అండర్ 17 విభాగంలో ఎం. మయూరి, షేక్ షమా ఎంపికయ్యారని చెప్పారు. ఈ నెల 21న గుడివాడలో జరుగనున్న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో తమ విద్యార్థినులు పాల్గొంటారని చెప్పారు.

## పాఠశాలల్లో చెకుముకి టాలెంట్ టెస్ట్



తిరువూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తిరువూరు నియోజకవర్గంలో పాఠశాల స్థాయిలో శనివారం చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. 8,9,10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. తిరువూరు పట్టణంలోని సిద్ధార్థ, నాగార్జున, ప్రభుత్వ బాలుర పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, మునుకుళ్ళ, ముష్టికుంట్ల, కోకిలంపాడు, వావిలాల, చిట్టేల, మల్లేల జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 2 వేల మంది విద్యార్థులు టాలెంట్ టెస్టుకు హాజరయ్యారని జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి పాపారావు తెలిపారు. ఏకొండూరు మండలంలో 800 మంది, గంపలగూడెం మండలంలో 1200 మంది చెకుముకి టాలెంట్ టెస్ట్ రాశారని నిర్వాహకులు తెలిపారు. పాఠశాల స్థాయిలో మెరిట్ సాధించిన విద్యార్థులకు నవంబరు 1న మండల స్థాయిలో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు.

### పట్టుదలతో చదివితే భవిష్యత్

చాట్రాయి: మారుతున్న విద్యా విధానంలో విద్యార్థులు పట్టుదలతో చదవాలని ఎంఈఓ–1 మాసగిరి శ్రీనివాస్ అన్నారు. చాట్రాయి వికాస్ హైస్కూల్‌ను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడుతూ చదువులో పోటీతత్వం అలవర్చుకుంటే ఉన్నత స్థానాలు అధిరోహించగలరన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యనారాయణ పాల్గొన్నారు.

## వైద్య విద్యను దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు రామిరెడ్డి



మాట్లాడుతున్న తంగిరాల రామిరెడ్డి

పుట్రేల(విస్సన్నపేట): రాష్ట్రంలో పేద విద్యార్థులకు వైద్య విద్యను కూటమి ప్రభుత్వం దూరం చేస్తోందని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ పరిశీలకుడు తంగిరాల రామిరెడ్డి అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పుట్రేల గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రెండు వారాలకుపైగా పోరాడుతున్నా విద్యాశాఖ మంత్రి ఇప్పటివరకు ఒక్క మాట మాట్లాడటం లేదన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకుని పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం సంతకాలు సేకరించారు. జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఓలేటి దుర్గారావు, పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, నాయకులు నరెడ్ల వీరారెడ్డి, యరమల రామచంద్రారెడ్డి, ఎ. కొండూరు జెడ్పీటీసీ సభ్యుడు భూక్యా గనియా, సర్పంచ్ కారు మంచి స్వాతి, శిరసాని ప్రకాష్, ముంగా జయరాజు, దోర్నాల దామోదరరెడ్డి, కోపల్లి జయకర్, జాకీర్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## పత్రికా స్వేచ్ఛను కాపాడాలి

తిరువూరులో జర్నలిస్టుల ధర్నా



తిరువూరు ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

తిరువూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తూ 'సాక్షి' మీడియాపై వేధింపులకు పాల్పడటాన్ని తిరువూరు పాత్రికేయులు తీవ్రంగా ఖండించారు. 'సాక్షి'పై దాడులు, జర్నలిస్టులపై అక్రమ కేసులను నిరసిస్తూ తిరువూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఎదుట ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు శనివారం ధర్నా నిర్వహించారు. సీనియర్ పాత్రికేయుడు ఖాజా మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికలు ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేస్తుంటే అక్కసుతో పాలకులు తప్పుడు కేసులతో బెదిరింపులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. పత్రికలు, పాత్రికేయులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పాత్రికేయులు అసుదుల్లా, దుబ్బాకు ఆనందరావు, ఎం. వెంకటనారాయణ, షేక్ సైదులు, బి. వెంకటేశ్వరరావు, బద్రి, ఎ. మురళి పాల్గొన్నారు.

## జూదాల నియంత్రణలో అలసత్వాన్ని సహించం

మంత్రి పార్థసారథి ఆదేశం

నూజివీడు: నియోజకవర్గంలో జూదాలు నిర్వహించే వారిని ఉక్కుపాదంతో అణచివేయాలని పోలీసు అధికారులను రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. జూదం వంటి అసాంఘిక కార్యక్రమాల నియంత్రణలో అలసత్వం వహించే పోలీసు అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా జూదాలపై పలు ఆరోపణలు, ఫిర్యాదులు మంత్రి దృష్టికి రావడంతో శనివారం ఆయన వర్చువల్ విధానంలో నూజివీడు పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఇకనుండైనా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని నియోజకవర్గంలో జూదాలు జరగకుండా చూడాలని సూచించారు.

## కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు అమలు చేయాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఆగిరిపల్లి: పేదల భూములను లాక్కొని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వాలు కుటిల ప్రయత్నాలు చేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోట కల్యాణ్ అన్నారు. శనివారం ఆగిరిపల్లిలో జరిగిన ఆగిరిపల్లి మండలం వ్యవసాయ కార్మిక సంఘం 6వ మహాసభలో ఆయన మాట్లాడారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసులను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆగిరిపల్లి మండలం వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాడి అర్జునరావు, కార్యదర్శిగా ఏపూరి రవీంద్ర, గౌరవ అధ్యక్షుడిగా సత్తు కోటేశ్వరరావు ఎన్నికయ్యారు.

## చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ



పల్లెర్లమూడిలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న హెచ్ఎంలు

నూజివీడు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సంబరాల పోస్టర్‌ను శనివారం పల్లెర్లమూడి హైస్కూల్‌లో ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణరావు మాట్లాడుతూ ఈనెల 22న పాఠశాల స్థాయిలోను, నవంబరు ఒకటిన మండల స్థాయిలోను, నవంబరు 23న జిల్లా స్థాయి, డిసెంబరు 12, 13, 14 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో చెకుముకి ప్రతిభ పరీక్షను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పల్లెర్లమూడి, మీర్జాపురం, మద్దాయికుంట హైస్కూల్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

## స్కూల్ గేమ్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తిరువూరు: తిరువూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల బాలురు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన క్రీడా పోటీల్లో అండర్ 19 విభాగంలో విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. రవిబాబు తెలిపారు. పాఠశాలకు చెందిన ఎల్. సిద్ధు వాలీబాల్, డీ టైటాన్స్ నిరీక్షణ, ఎం. చక్రవర్తి, ఎ. చరణ్ హ్యాండ్ బాల్ కేటగిరీలలో రాష్ట్ర స్థాయి పోటీలలో ఎన్టీఆర్ జిల్లా జట్టులో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థులను జిల్లా కోఆర్డినేటర్ మురళీకృష్ణ, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.

## నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న



బాణసంచా దుకాణదారులకు సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్ వినూత్న

నూజివీడు: బాణసంచా దుకాణదారులు తగిన జాగ్రత్తలు తీసుకొని విక్రయాలు నిర్వహించాలని, లేకుంటే దుకాణం నిర్వహణకు ఇచ్చిన అనుమతిని రద్దు చేస్తామని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న హెచ్చరించారు. పట్టణంలోని విస్సన్నపేట రోడ్డులో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయనున్న లారీ అసోసియేషన్ స్థలాన్ని శనివారం సబ్ కలెక్టర్ వినూత్న పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ దుకాణానికి, దుకాణానికి మధ్య మూడు అడుగుల దూరం ఉండాలని, షెడ్లకు రేకులను ఉపయోగించాలన్నారు. ప్రతి దుకాణం వద్ద నీరు, ఇసుక సిద్ధంగా ఉండాలని, పరిసరాల్లో ఎవరూ పొగతాగకుండా చూడాలని, కార్బన్‌డైఆక్సైడ్ సిలిండర్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. దుకాణాల వద్ద దీపావళి రోజున ఫైర్ ఇంజిన్‌ను ఉంచాలని ఫైర్ అధికారి జి. నాగరాజును ఆదేశించారు. దుకాణాల్లో పనిచేసే వ్యక్తులు పొగతాగరాదని, ఆవరణ అంతా కవర్ అయ్యేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. చెత్తచెదారాన్ని దుకాణాల సమీపంలో ఎట్టి పరిస్థితుల్లో తగులపెట్టవద్దన్నారు. పోలీసు, రెవెన్యూ, ఫైర్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. తహసీల్దార్ బద్రూనాయక్, సీఐ పి. సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

### బాలికలకు చదువే ఆయుధం

నూజివీడు: మానవ సమాజం ఎంత అభివృద్ధి చెందుతున్నప్పటికీ నేటికీ బాలికలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి సబ్ కలెక్టర్ మాట్లాడుతూ బాలికలకు చదువే ఆయుధమని, చదువు ద్వారానే బాలికల్లో మార్పు వస్తుందని, స్వతంత్రంగా ఎదగడం సాధ్యమవుతుందన్నారు. చదువుపైనే దృష్టి సారించి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని చెప్పారు. రోజూ ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చుకోవాలని, చదవడాన్ని ఎంజాయ్ చేయాలన్నారు. తల్లిదండ్రులే పిల్లలకు ఫౌండేషన్ అని, వారు పిల్లలపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా చక్కగా చదువుకోవాలన్నారు. ఉన్నత స్థానాల్లో ఉన్న వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని చెప్పారు. బాల్య వివాహాలు చేస్తుంటే వద్దని చెప్పి ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండేలా ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. బాలికలు, మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు తెచ్చిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. క్రమశిక్షణతో చదువుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. ఐసీడీఎస్ ఏలూరు పీడీ శారద మాట్లాడుతూ మహిళలకు అవకాశాలు కల్పిస్తే అంతరిక్షంలోకి సైతం వెళ్తామని నిరూపించారన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని, బాలికలు తమకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీడీపీఓ పిల్లి విజయకుమారి, సీఐ పి. సత్యశ్రీనివాస్, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. పద్మావతి, తహసీల్దార్ బద్రూ నాయక్, డీవైఈఓ పీఎస్ సుధాకర్, హెచ్ఎం బి. అనురాధ తదితరులు పాల్గొన్నారు.

### స్టడీ మెటీరియల్ పంపిణీ



విస్సన్నపేట: మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రూపొందించిన ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ఈ మెటీరియల్ ఉపయోగపడుతుందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ అన్నారు. పాఠశాల హెచ్ఎం శోభారాణి, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

- తిరువూరు: నేషనల్‌మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు హాజరయ్యేందుకు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను శనివారం తిరువూరు మండలంలో 132 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు.

### బాలికల్లో రక్తహీనతను నివారించాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కౌమార దశ బాలికల్లో ఏర్పడే రక్తహీనతను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని మైలవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ కె.పుష్పలత పేర్కొన్నారు. బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని జరుగుతున్న వారోత్సవాల్లో భాగంగా కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాలలో శనివారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాలికల్లో వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, బాలికా విద్య అంశాలపై అవగాహన కల్పించారు. రక్తహీనత నివారణకు అంగన్‌వాడీలు, ఆశాలు ఆయా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈసందర్భంగా బాలికలకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సెక్టార్ సూపర్‌వైజర్ శివకుమారి, టాటా ట్రస్ట్ కో–ఆర్డినేటర్ దివ్య పాల్గొన్నారు.

### ధన్వంతరి జయంతి వేడుకలు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వైద్య నారాయణుడిగా పేరు గడించిన ధన్వంతరి 18వ జయంతి వేడుకలు కొండపల్లి నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధన్వంతరి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయీ బ్రాహ్మణ జాతీయ కన్వీనర్ మద్దులూరి శ్రీనివాసులు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులు ఉన్నత విద్య అభ్యసించి వైద్య రంగంలో పూర్వవైభవం నిలబెట్టాలని కోరారు. మాల్కాపురపు సాంబశివరావు, సత్యనారాయణ, రెడ్డమ్మ, గోవింద్, అచ్యుతరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న వెంకటప్పయ్య

ఆగిరిపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని ఏలూరు జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్–2 ఎం. వెంకటప్పయ్య ఆదేశించారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచాలని వంట ఏజెన్సీ వారికి సూచించారు. విద్యార్థులకు తాజా కూరగాయలతో భోజనం వడ్డించాలన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా కృషి చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం జిల్లా కో–ఆర్డినేటర్ గౌస్ మొహిద్దీన్, ఎంఈఓ– 2 కొవ్వలి ఆనంద్ కుమార్, ప్రధానోపాధ్యాయిని పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ

ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ శివరామాంజనేయులు



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న సీఈ శివరామాంజనేయులు

ఇబ్రహీంపట్నం: మొక్కల పెంపకం ద్వారా కాలుష్యాన్ని కొంతవరకు నివారించవచ్చని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ శివరామాంజనేయులు అన్నారు. ఎన్టీటీపీఎస్‌లో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వాయు కాలుష్యం విపరీతంగా పెరిగిపోయి పౌరుల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతోందన్నారు. గాలి నాణ్యతలో తగ్గుదల వలన శ్వాసకోశ వ్యాధులు, హృదయ సంబంధిత వ్యాధులు పిల్లలు, వృద్ధుల్లో సైతం వ్యాపిస్తున్నాయని చెప్పారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. ప్లాంట్‌లో సైకిళ్లపై ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. సంస్థ ప్రాంగణంలో మొక్కలు నాటారు. పలువురు సీనియర్, జూనియర్ ఇంజినీర్లు, కార్మికులు పాల్గొన్నారు.

- విస్సన్నపేట: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి అన్నారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక లయన్స్ క్లబ్ వద్ద అధికారులు శనివారం మొక్కలు నాటారు. ఎంపీడీఓ చేకు చిన్నరాట్నాలు తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన అవసరం

15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ

నూజివీడు: బాల్య వివాహాలు నేరమని, అలా చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగశైలజ హెచ్చరించారు. తుక్కులూరులో శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు బాలబాలికలపై జరిగే లైంగిక వేధింపులపై కఠిన శిక్షలున్నాయని, పోక్సో చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తారన్నారు. విద్యా హక్కు చట్ట ప్రకారం 15 ఏళ్ల లోపు పిల్లలందరూ బడికెళ్లి చదువుకోవాలని చెప్పారు. స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, పంచాయతీ సెక్రటరీ చంద్రిక, తుక్కులూరు, అన్నవరం సీసీలు ఎలినా రాణి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

### కాట్రేనిపాడు బాధితులకు న్యాయం చేయాలని వినతి

ముసునూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో కాట్రేనిపాడు ఎస్సీ పేదల కోసం గుర్తించిన ఇళ్ల స్థలాలను వారికే కేటాయించాలని బాధితులు నూజివీడు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితుల తరపున వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ స్టేట్ సెక్రటరీ కంబాల రాంబాబు, మాజీ సర్పంచ్ సొంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2007లో లబ్ధిదారుల వాటా చెల్లించి, కొనుగోలు చేసిన భూమిని వారికే కేటాయించాలని కోరారు.

### పీఎం సూర్య ఘర్ యోజనపై అవగాహనా ర్యాలీ

ఇబ్రహీంపట్నం: ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనపై జీఎస్టీ తగ్గింపుపై విద్యుత్ శాఖాధికారులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ శాఖ కార్యాలయం నుంచి ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ వరకు ర్యాలీ జరిపారు. విద్యుత్ శాఖ ఈఈ వసంతరావు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై ఒక కిలోవాట్ సోలార్ ప్యానల్‌కు రూ.30 వేలు, 2 కిలోవాట్‌లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్‌లకు రూ.78 వేలు చొప్పున ప్రభుత్వ రాయితీ ఇస్తుందన్నారు. విద్యుత్ వినియోగం పెరగడంతో దానికి తగ్గట్టు విద్యుత్ ఉత్పత్తి కూడా పెరగాలనే ఆలోచనతో పీఎం సూర్యఘర్ పథకాన్ని రూపకల్పన చేశారన్నారు. మైలవరం, ఇబ్రహీంపట్నం డివిజన్ డీఈఈలు సుధాకర్, గురుకిషోర్, ఉద్యోగులు పాల్గొన్నారు.